
మత్తడి దూకుతున్న బోయినపల్లి చెరువు


గంభీరావుపేట: పరవళ్లు తొక్కుతున్న సింగసముద్రం


వేములవాడఅర్బన్: నాగయ్యపల్లిలో రహదారిపై పారుతున్న వరదనీరు

వరద బీభత్సం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

జిల్లాలో ఒక్కరాత్రితో వాతావరణం తారుమారైంది. ఏకధాటిగా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగుతున్నాయి. రోడ్డు, పొలాలు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లు వరద దాటికి తెగిపోయాయి. గ్రామాల్లోకి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

– సాక్షి నెట్‌వర్క్

➡ ఎల్లారెడ్డిపేట మండలంలో వరద బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వెంట ఉన్న ఇళ్లలోకి భారీగా వరద చేరగా విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి జేసీబీ సాయంతో డివైడర్ తొలగించి వరదను మళ్లించారు. అక్కపల్లి దారిలో లేతమామిండ్లవాగు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. నారాయణపూర్ శివారులో పెద్దమ్మ ఒర్రె పొంగడంతో రాకపోకలు నిలిపివేశారు. మండల కేంద్రంలోని గిద్దెచెరువు మత్తడి దూకగా, సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నీటి ప్రవాహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరిశీలించారు. సింగసముద్రం పరవళ్లు తొక్కుతోంది. సిరిసిల్ల, కామారెడ్డి ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. వెంకటాపూర్ ఎల్లమ్మ గుడి వద్ద ప్రధాన రహదారిపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. వాహనాలను దారిమళ్లించి బైపాస్‌రోడ్డు గుండా కరీంనగర్‌కు అనుమతిస్తున్నారు. భారీ వర్షాలకు పదిర బ్రిడ్జి కుంగిపోయింది. కిషన్‌దాస్‌పేట శివారులోని తిమ్మాసీకుంట చెరువుకు గండి పడింది.

➡ వేములవాడ మండలంలో ప్రధాన రహదారుల్లో కల్వర్టులపై నుంచి వరదనీరు పారడంతో రాకపోకలను నిలిపివేశారు. పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

➡ కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో మూలవాగు ప్రాజెక్ట్ వద్ద ఉన్న వంతెన కింద బుంగ ఏర్పడింది. ప్రాజెక్ట్ వద్ద మరిమడ్లకు వెళ్లే దారిలో వంతెన ఉంది. ప్రాజెక్ట్ మత్తడి దూకుతుండడంతో నీరంతా ఈ వంతెన కిందనుంచే వెళ్లి మూలవాగు కలుస్తుంది. వంతెన కింద బుంగ ఏర్పడడంతో వంతెన పక్కన రహదారి కుంగిపోయే ప్రమాదం ఉండడంతో వంతెన మీదుగా రాకపోకలు నిలిపివేశారు.

➡మామిడిపల్లిలో ఎస్సీకాలనీని వరద నీరు చుట్టేసింది. మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మూలవాగును ఆనుకుని ఉన్న ఎస్సీకాలనీలోని 150 ఇండ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. తమను ఆదుకోవాలని, తక్షణమే పునరావాసం కల్పించాలని కోరారు. కోనరావుపేట–సిరిసిల్ల మార్గంలో మల్కపేట వద్ద పెద్దమ్మ ఒర్రె, కోనరావుపేట శివారులో ఒర్రె, కొండాపూర్ శివారులో ఉన్న పెంటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నిమ్మపల్లి, సిరిసిల్ల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మామిడిపల్లి–నిజామాబాద్, వెంకట్రావుపేట–బావుసాయిపేట, వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. పీహెచ్‌సీలోకి నీరువెళ్లి పరికరాలు నీటమునిగాయి.

➡ తంగళ్లపల్లి మండలంలోని సంద్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సంద్రవాగు ద్వారా వెళ్లే నీరు మానేరు వాగులో చేరుతోంది. అలాగే సారంపల్లి ఎల్లమ్మ చెరువును గురువారం రాత్రి డీపీవో రవీందర్, ఎంపీడీవో పి.లచ్చాలుతో కలిసి పరిశీలించారు.

➡ గంభీరావుపేట మండలంలోని మల్లుపల్లి, నాగంపేట గ్రామాల మధ్య రోడ్డు వరద మూల వాగు ఉధృతికి తెగిపోయింది. గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న లోలెవల్ వంతెన నీట మునిగింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సింగసముద్రం పరవళ్లు తొక్కుతోంది. ఎగువమానేరు ప్రాజెక్టు వరద, మూలవాగుల ద్వారా వస్తున్న వరద నీటితో సముద్రం పూర్తిస్థాయిలో నిండి ఏడు మత్తడులు పోస్తోంది. పర్యాటకులను ఎవరు రాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

➡ బోయినపల్లి: మండలంలోని స్తంభంపల్లి గంజివాగు, బోయినపల్లిలో రెండు కల్వర్టులపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో గంగాధర, వేములవాడ, కొదురుపాక గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. బోయినపల్లి– మర్లపేట రోడ్డు కల్వర్టు, రామన్నపేట నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డు తెగిపోయాయి. విలాసాగర్, తడగొండ, బోయినపల్లి, కోరెం, నర్సింగాపూర్ స్తంభంపల్లి చెరువులు అలుగులు పారుతున్నాయి. వెంకట్రావుపల్లి ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో నర్సింగాపూర్– విలాసాగర్ రాకపోకలు నిలిచిపోయాయి. మల్కాపూర్‌లో ఎల్లమ్మ కుంట మత్తడి దూకడంతో పది కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బోయినపల్లి ఠాణా పరిసరాలు జలమయమయ్యాయి.


కోనరావుపేటనిమ్మపల్లిలో వంతెన కింద ఏర్పడిన బుంగ


కనగర్తి వీధిలో ప్రవహిస్తున్న నీరు


కిషన్‌దాస్‌పేట శివారులో తెగిన తిమ్మాసికుంట


కాలువ తీస్తున్న బోయినపల్లి ఎస్సై, సిబ్బంది


ముస్తాబాద్: ఆవునూర్‌లో కూలిన ఇల్లు


గంభీరావుపేట: నీట మునిగిన లింగన్నపేట వంతెన


వీర్నపల్లి: గర్భిణులను తరలిస్తున్న ఎస్సై నవత


కోనరావుపేట: మల్కపేట వద్ద పెద్దమ్మ ఒర్రె


ఆస్పత్రిలోకి చేరిన వరద నీరు

క్లుప్తంగా

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఏవోకు వినతి


ఏవో గంగయ్యకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘాల నేతలు

సిరిసిల్లటౌన్: గ్రామ పంచాయితీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి వీడాలని కార్మిక సంఘాల ప్రతినిధులు గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ గంగయ్యకు వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. చాలా రోజులుగా కార్మికుల సమస్యలపై సమ్మె చేపడుతున్నా, ప్రభుత్వం పట్టింపులేమిగా ఉండటం సరికాదన్నారు. మూడ్రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, మల్యాల నర్సయ్య, బుర్ర శ్రీనివాస్, జెల్లి లక్ష్మణ్, కృష్ణవేణి, మల్లయ్య పాల్గొన్నారు.

విష్ణుసహస్రనామాలతో మానవాళికి శుభం


ప్రవచనం చెబుతున్న వేణుగోపాలాచార్య

ఎల్లారెడ్డిపేట: విష్ణుసహస్ర నామాలను పఠిస్తే ప్రతి ఒక్కరికి శుభం జరుగుతుందని జగిత్యాల శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక అన్నారు. మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం భక్తులకు విష్ణుసహస్ర నామాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, రాచర్ల రఘురామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

గేదెను కాపాడిన సర్పంచ్



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగుండారం శివారులో గురువారం సాయంత్రం వాగులో పడి కొట్టుకుపోతున్న పాడి గేదెను గ్రామ సర్పంచ్ భూక్య శంకర్ నాయక్ కాపాడాడు.

‘తండ్రీకొడుకుల పాలనతోనే ఈ దుస్థితి’


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ/వేములవాడఅర్బన్: తండ్రీకొడుకుల పాలనతోనే వేములవాడకు ఈ దుస్థితి నెలకొందని, ఏటా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలవాసులు వరదతో ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. పట్టణ శివారులోని కోనాయపల్లి రోడ్డు బుడగజంగాల కాలనీ, మల్లారం రోడ్డులోని లోతట్టు ప్రాంతాలు, తిప్పాపూర్ శివారులోని సవరాలకాలనీలో నీటమునిగిన ప్రాంతాలను పరిశీలించి బాధితులకు పండ్లు అందజేశారు. అనంతరం ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దారు రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌కు పరిస్థితిని వివరించారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసినట్లు చెప్పుకుంటున్న పాలకులకు లో లెవల్ బ్రిడ్జీలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు సాగారం వెంకటస్వామి, సంగ స్వామి, శ్రీనివాస్‌గౌడ్, కోయినేని బాలయ్య, తూం మధు, కనికరపు రాకేశ్, ఖమ్మం గణేశ్, నాగుల రవీందర్, నరేశ్ తదితరులు ఉన్నారు.

‘ఏ సమస్య వచ్చినా తెలియచేయండి’


మాట్లాడుతున్న తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల రహదారులపై వరద నీరు అలుగు పారుతుండడంతో రాకపోకలు నిలువరించేందుకు అధికారులు రోడ్డుకు ఇరువైపుల పంచాయతీ ట్రాక్టర్లను అడ్డంగా ఉంచారు. ఇప్పటికీ 15 ఇళ్లు కూలినట్లు తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ తెలిపారు. వీరిని దగ్గర్లోని గ్రామపంచాయతీ, పాఠశాల భవనాలు, వారి బంధువుల ఇళ్లలో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు పొలాల దగ్గర కరెంటు స్తంభాల దగ్గర జాగ్రత్త తీసుకోవాలన్నారు. ప్రాణ, పశు, ఆస్తి నష్టం సంభవించినా, చెరువులు నిండి మత్తడి దూకిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల కంట్రోల్ రూం నంబర్ 92814 87034 కు ఇవ్వాలని కోరారు. గామాల్లో రోడ్లు తెగే ప్రమాదం ఉంటే, గర్భవతులు ఉంటే ఆశ వర్కర్లతో దగ్గరలో వున్న సివిల్ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఇందుకు మండల స్థాయి, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. వీరితో ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై నవత, ఎంపీడీవో నరేశ్, డిప్యూటీతహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు బాధితుల తరలింపు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బొమ్మెన కిరణ్ కుటుంబాన్ని గురువారం పోలీసులు ప్రభుత్వ పాఠశాలకు తరలించి తాత్కాలిక వసతి ఏర్పాటు చేశారు. సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ స్వప్న, ఏఎస్సై ముఖీద్,పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లే యువకుడి తిప్పలు



చందుర్తి: మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన కాతుబండ సురేశ్ దుబాయ్ వెళ్లగా, రెండు మాసాల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తిరుగు ప్రయాణం శుక్రవారం ఉదయం దుబాయ్‌కి విమానం ఉండడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు గురువారం ఎన్గల్ నుంచి వేములవాడ బయలుదేరాడు. మధ్యలో బండపల్లి గ్రామంలో లోలెవల్ వంతెన వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అక్కడే చిక్కుకుపోయాడు. విషయం తెలుసుకున్న బండపల్లికి చెందిన పల్లి రాజు ట్రాక్టర్‌లో సురేశ్‌ను లోలెవల్ వంతెనను దాటించాడు. దీంతో బాధితుడు ఎయిర్‌పోర్టుకు పయనమయ్యాడు.

ప్రమాదం అంచున పెద్దవాగు


మాట్లాడుతున్న శ్రీనివాస్

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఇటీవల రూ.1.20 లక్షలతో తూతు మంత్రంగా బ్రిడ్జి పనులు పూర్తి చేశారని గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ అన్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పెద్దవాగు బ్రిడ్జి నుంచి వంద మీటర్ల పొడువున నీరు ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జికి ఇరుపక్కల మట్టి పోసి వదిలివేయడంతో కోతకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం రోడ్డు పక్కన కంకర కుప్పలు పోసి వదిలివేయడంతో వర్షపు నీటి ప్రవాహానికి నేరెళ్ల ముత్యం, నాగరాజుల పంట పొలాలకు వచ్చి చేరాయి, దీనితో పాటు వర్షపు నీరు చేరడంతో చెరువును తలపించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు తమను ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు.

తెగిన మర్లపేట కల్వర్టు

బోయినపల్లి: ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నాసిరకం పనులతో బోయినపల్లి–మర్లపేట రోడ్డులో నిర్మించి కల్వర్టు తెగిపోవడానికి కారణమని బీఎస్పీ మండల అధ్యక్షుడు అలువాల అజయ్ ఆరోపించారు. మండల నాయకులతో కలిసి తెగిన కల్వర్టును గురువారం పరిశీలించారు. రూ.9 లక్షల అంచనాలతో కల్వర్టు నిర్మించిన ఐదు నెలలకే కల్వర్టు కోతకు గురై నీళ్ల పాలు కావడం దారుణమన్నారు. అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అజయ్ డిమాండ్ చేశారు.

కూలిన ఇళ్లు

ముస్తాబాద్: భారీ వర్షాలతో ఆవునూర్‌లో చిన్ని హంసవ్వ, యాదగిరికి చెందిన ఇండ్లు కూలిపోయాయి. మొర్రాపూర్‌లో భూక్య కల్యాణ్, తెర్లుమద్దిలో విశ్వనాథ్, మొర్రాయిపల్లెలో బాలవ్వ, రామలక్ష్మణపల్లెలో దమ్మ లక్ష్మి, ఎల్లవ్వ, పెద్ద పాక బాలయ్య, పోతుగల్‌లో పర్శరాములు, గన్నెవారిపల్లెలో మామిండ్ల ఎల్లవ్వ, గూడెంలో మండెపల్లి మల్లయ్యకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. తహసీల్దార్ మునిందర్, ఎస్సై శేఖర్ పరిశీలించారు.

వేములవాడఅర్బన్: మండలంలో 16 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 10 ఇళ్లు, మారుపాక, గుర్రవాణిపల్లి, వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి, నాగయ్యపల్లి, పోశెట్టిపల్లి, హన్మాజీపేట ఒక్కో ఇళ్లు చొప్పున పాక్షికంగా కూలినట్లు తెలిపారు.

కోనరావుపేట: మండలంలో నిమ్మపల్లికి చెందిన దప్పుల నర్సయ్య, కనగర్తికి చెందిన అండెం లచ్చవ్వ, కోనరావుపేటకు చెందిన సుల్తాన్ పోశయ్య ఇల్లు కూలిపోయాయి. నిమ్మపల్లిలో గొరు చిన్న రాజం, ఉడుగుల రాజయ్య ఇళ్లు కూలడంతో వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

విపత్కర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ అన్ని విధాలా ఆదుకుంటుంది
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- బుడగజంగాల కుటుంబాలకు రూ. 3 వేల చొప్పున అందజేత


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: విపత్తులు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ తమకు తాముగా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూచించారు. భారీ వర్షాలతో అతలాకుతలం అయిన ప్రాంతాలు, కాలనీలను ఆయన గురువారం చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలసి పర్యటించారు. పట్టణంలోని కోనాయపల్లి రోడ్డులోని లోతట్టు ప్రాంతాల బుడగజంగాల ఒక్కో కుటుంబానికి రూ.మూడు వేల ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. వరదల వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శాత్రాజుపల్లి రోడ్డు, మల్లారంరోడ్డు, బతుకమ్మ తెప్ప ప్రాంతంలో మూలవాగు ప్రవాహం, చెక్కపల్లి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్, లాలపల్లి కట్టు కాలువ, నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. అధికారులంతా అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. బుడగజంగాల కుటుంబాలకు శాశ్వత పరిష్కారం చూపించబోతున్నట్లు చెప్పారు. ఇప్పటికే 35 మందిని డబుల్ బెడ్రూమ్‌లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయన వెంట తహసీల్దారు రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, డీఈ శాంతయ్య, సీఐ కరుణాకర్, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్‌రావు, మారం కుమార్, జోగిని శంకర్, సిరిగిరి చందు, నాయకులు పుల్కం రాజు, కుమ్మరి శ్రీనివాస్, నామాల లక్ష్మిరాజం, ఏశ తిరుపతి, గూడూరి మధు, కృపాల్, రాము పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్లటౌన్: భారీ వర్షాల నేపథ్యంలో మరో మూడ్రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పిలుపునిచ్చారు. గురువారం ఆమె ప్రెస్‌మీట్లో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న ఇంటిలో ఎవరూ ఉండరాదన్నారు. కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు వచ్చే క్రమంలో స్తంభాలు, సెల్ టవర్లకు దూరంగా ఉండాలని సూచించారు. మానేరు వాగు, పట్టణం చుట్టుపక్కల చెరువులు, నాలాల్లోకి ఎవరూ పోరాదన్నారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బయటికి రావొద్దు

ఇల్లంతకుంట: అవసరమైతే తప్ప బయటికి రావొద్దని తహసీల్దార్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరగడంతో సర్జ్ గేట్లను ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని బిక్కవాగులోకి వదలడం జరిగిందని, బిక్కవాగు పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫంక్షన్ హాల్‌లో ఉండండి

ఎల్లారెడ్డిపేట: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వారం రోజులు కురుస్తున్న వర్షాలతో ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండవద్దని, వర్షాలు తగ్గు ముఖం పట్టే వరకు స్థానికంగా ఉన్న తన ఫంక్షన్ హాల్‌లో ఉండేందుకు ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇక్కడ భోజన వసతి కూడా ఉంటుందన్నారు. ఎడతెరపి లేని వర్షాలతో ఇప్పటికే మూడు ఇళ్లు కూలిపోయాయన్నారు. రాత్రివేళ శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో ఉండి ఇబ్బందులు పడవద్దన్నారు. వరదలు, వర్షాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

వరదబాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో భారీ వర్షాలకు ఇళ్లు నీట మునిగి రోడ్డున పడ్డ ఐదు కుటుంబాలకు మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు అనవేని రవి గురువారం నిత్యావసర సరుకులను అందజేశారు. గ్రామానికి చెందిన ఉల్లి దేవయ్య, ఇఫ్తార్, పెంటయ్య, పెద్దమ్మ, నారాయణ చిట్టివాగు పక్కన నివాసాలు ఉండగా వారి ఇళ్లలోకి వరద నీరు చేరి విలువైన సామగ్రి తడిసిపోయింది. వారిని సురక్షిత ప్రాంతానికి తరలించి, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.